సాక్షి
శ్రీకాకుళం

బుధవారం : 30 : ఏప్రిల్ : 2025



నిషేధమేనా..?

వేటకు వెళ్లేవారిపైనా ప్రభుత్వం నిషేధం విధిస్తోంది. భృతి ఇవ్వకుండా వేధిస్తోంది.

- 8లో



మద్యానికి బానిసై..

మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇచ్ఛాపురంలో ఘటన జరిగింది.

- 8లో

కోటబొమ్మాళి జడ్జి సస్పెన్షన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జీఎస్ఆర్ ప్రసన్నలతను ఉన్నత న్యాయస్థానం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లాకు ఉత్తర్వులు చేరాయి. ఈమెను శాఖపరమైన అంశాల్లో జాప్యం కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు సమాచారం.

రోడ్డు పక్కనే వ్యర్థాలు ఎన్నెన్నో అనర్థాలు





ఈ చిత్రం ఎచ్చెర్ల నుంచి చిలకపాలెం వెళ్లే దారిలో ఉన్న ఫ్లై ఓవర్ సమీపం లోనిది. పారబోసిన వ్యర్థాలు ఏమిటో తెలుసా.. కాలం చెల్లిన సిరప్‌లు. ఇలా ఎక్స్‌పైర్ అయిన మందుల్ని ఎక్కడ పడితే అక్కడ పారవేయకూడదు. ఇలా భూమిలో కలిపేయడం కూడా ప్రమాదమే. కానీ ఇలా మందుల్ని ఇష్టానుసారం పారవేయడం ఈ ప్రాంతంలో నిత్యకృత్యంగా మారింది.

డంపింగ్ యార్డులుగా రహదారులు

- కుప్పలుతెప్పలుగా వ్యర్థాల పారబోత
- రహదారుల వెంబడి దుర్వాసన
- అధికారుల చోద్యం
- ఇబ్బందుల్లో ప్రజానీకం

సాక్షి పరిశీలన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రహదారుల పక్కన వ్యర్థాలు డంపింగ్ అవుతున్న విషయంపై 'సాక్షి'కి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎచ్చెర్ల నుంచి పొందూరు మండలం రాపాక వరకు 25 కిలోమీటర్ల దూరాన్ని 'సాక్షి' క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. పరిశీలనలో భయంకరమైన వ్యర్థాలు ఎలా పారబోస్తున్నారో వెల్లడైంది. పర్యవేక్షణ లేదనే విషయం కూడా పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. చాలా కాలంగా ఈ తంతు జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

చీకటి పడితే చాలు..

నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో చీకటి పడితే చాలు. వ్యర్థాల డంపింగ్ గుట్టుగా సాగిపోతోంది. భవన నిర్మాణ వ్యర్థాలు.. మెడికల్ వేస్టేజ్.. ఫౌల్ట్రీ వ్యర్థాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇక పాలిథిన్ మాట ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎక్కడైనా ఫంక్షన్ జరిగిందో అంతే సంగతులు.. ఆ ఊరి చివరి గుట్టలుగుట్టలుగా పాలిథిన్ వ్యర్థాలు దర్శనమివ్వడం పరిపాటిగా మారిపోయింది.

వందలాది మంది రాకపోకలు..


- 'సాక్షి' పరిశీలించిన ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు.. వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు.
- డంపింగ్ జరుగుతున్న ప్రదేశాలకు సమీపంలో కళాశాలలు.. వసతి గృహాలు ఉన్నాయి.
- అత్యధిక సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు.
- కూరగాయల విక్రయాలు కూడా వీటికి సమీపంలోనే సాగుతున్నాయి.
- మూగజీవాలు అత్యధికంగా సంచరించే ప్రదేశాలు కూడా ఇందులో ఉన్నాయి.
- ఇవేమీ పట్టనట్టుగా వ్యర్థాలను పారబోస్తూ కొందరు పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారు.
- ఈ అంశంపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఈ వ్యర్థాల పారబోతకు అడ్డుకట్ట వేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని వారు కోరుతున్నారు.

పొందూరు మండలం రాపాక జంక్షన్ నుంచి కృష్ణాపురం వచ్చే మార్గంలోని రహదారి ఇది. చిత్రంలో ఉన్నవేమిటో తెలుసా.. బాయిలర్ కోళ్లకు సంబంధించిన వెంట్రుకలు.. ఇతర పౌల్ట్రీ వ్యర్థాలు. అసలే బర్డ్ ఫ్లూ వంటి వ్యాధుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ఇలా పౌల్ట్రీ వ్యర్థాలను జాతీయ రహదారి పక్కనే పారవేయడం ఎంత వరకు సమంజసం.



ఇది కూడా పొందూరు మండలం రాపాక జంక్షన్ నుంచి కృష్ణాపురం వచ్చే మార్గమే. ఈ చిత్రంలో మూటలా ఉన్నవి ఏమిటో తెలుసా.. సోఫాలకు వినియోగించే లెదర్ షీట్ ముక్కలు. వీటిని ఇలా మూటలుగా కట్టి డంప్ చేస్తున్నారు.






ఈ ప్రాంతమూ రాపాక పరిసరమే. తెల్లగా ఉన్నదేమిటో తెలుసా.. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్. భవన నిర్మాణాల్లో సీలింగ్ కోసం వినియోగించి ఆ వ్యర్థాలను ఇలా రహదారి పక్కనే పారవేస్తున్నారు.



ఇవి గాజు పెంకులు కాదండోయ్. అత్యంత ప్రమాదకరమైన వాయువులుండే టీవీలకు సంబంధించిన పిక్చర్ ట్యూబ్‌లు. వీటిని పెద్ద ఎత్తున రాపాక సమీపంలో డంప్ చేసేస్తున్నారు. వాటిని పగలకొట్టి మరీ పారేస్తున్నారు. ఆ సమయంలో ప్రమాదకర వాయువులు పర్యావరణంలో కలుస్తున్నాయి.



చిలకపాలెం నుంచి పొందూరు వెళ్లే రోడ్డు ఇది. చిలకపాలెం గ్రామ సరిహద్దుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా డంప్ అవుతున్నా అడిగే నాథుడే లేడు. చూడండి రోడ్డు పొడవునా ఎలా స్వాగతం పలుకుతున్నాయో..!

పౌల్ట్రీ వ్యర్థాలతో అనర్థాలు



హైవే పక్కన దాదాపు వెయ్యి వరకు పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. వీటి వ్యర్థాలను నిర్వీర్యం చేసే విషయంలో ఎవరికీ అవగాహన లేదు. వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీని వల్ల వెంట్రుకలు గాలిలోకి ఎగిరి వాహనదారుల కళ్లలో పడుతున్నాయి. అలాగే సింథటిక్, లెదర్, ప్లాస్టిక్ వంటి వాటిని గొయ్యి తీసి పూడ్చాలి. లేదంటే ప్రమాదకరం. ఎలక్ట్రానిక్ వేస్టు వల్ల కూడా ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయి. – కొమ్ము రమణమూర్తి, డైరెక్టర్, స్వీప్ స్వచ్ఛంద సేవా సంస్థ

అత్యంత ప్రమాదకరంగా పర్యావరణం



చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తూ ఊర్లను నదులను సముద్రాలను చెత్తకుండీలుగా మార్చడం వల్ల నేల, నీరు, గాలి, భూగర్భ జలాలు కలుషితం కావడమే కాక అనేక రకాల వ్యాధులు వ్యాపిస్తాయి. మనం వాడి పడేసే అనేక వ్యర్థ పదార్థాల్లో గంధకం ఒకటి. ఇది వాతావరణంలో సల్ఫర్ డైఆక్సైడ్ విడుదల చేస్తుంది. ఇది విష వాయువు. వస్తువులను రీసైకిల్ చేసి వాటి నుంచి కొత్త వస్తువులు తయారు చేయడం అనేది చాలా కీలకం. దీనిపై అవగాహన కలిగి ఉండాలి. – ఎం.పద్మనాభరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, టెక్కలి

డంపింగ్ పెరిగింది



జనావాసాల్లో విచ్చలవిడిగా చెత్త డంపింగ్ పెరుగుతోంది. మనం వినియోగించే వస్తువుల్లో ఎలక్ట్రికల్‌తో పాటు పాలిథిన్ వస్తువులు పర్యావరణానికి, ప్రజల జీవన మనుగడకు ఎంతో ప్రమాదకరం. సాగునీటి వనరుల సమీపంలో వ్యర్థాలు వేయడం వలన ఒక వైపు వ్యవసాయంతో పాటు మరో వైపు భూగర్భ జలాలు విష పూరితంగా మారుతున్నాయి. దీనిపై పంచాయతీ యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలి.

-కె.ధర్మారావు, ప్రజా సంఘాల నాయకుడు, టెక్కలి

వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్తగా తమ్మినేని సీతారాం



తమ్మినేని సీతారాం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం నియమితులయ్యారు. తాజాగా పార్టీ పరిశీలకుల నియామకాల నేపథ్యంలో తమ్మినేని సీతారాంను పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తమ్మినేని నియామక ఉత్తర్వులను పార్టీ కార్యాలయం మంగళవారం రాత్రి జారీ చేసింది. అపార అనుభవం ఉన్న నాయకుడిగా, పార్లమెంట్ పరిధిలో అందరికీ పరిచయం ఉన్న నేతగా, పార్టీలో సీనియర్ నేతగా గుర్తించి పార్లమెంట్ సమన్వయకర్త బాధ్యతలను అప్పగించారు. ఇప్పటికే పార్టీ రాజకీయ సలహా కమిటీ(పీఏసీ) సభ్యులుగా ఉన్న తమ్మినేనికి తాజాగా పార్లమెంట్ బాధ్యతలు అప్పగించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటు పరిశీలకుడిగా కుంభా రవిబాబు

- పార్టీ విజయనగరం పార్లమెంటు పరిశీలకుడిగా కిల్లి సత్యనారాయణ



కుంభా రవిబాబు



కిల్లి సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంటు పరిశీలకునిగా ఎమ్మెల్సీ కుంభా రవిబాబు నియమితులవ్వగా, విజయనగరం పార్లమెంటు పరిశీలకునిగా కిల్లి సత్యనారాయణ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీనియారిటీకి ప్రాధాన్యత కల్పించారు. మాజీ ఎమ్మెల్యే కుంభా రవిబాబు జిల్లా నాయకులందరికీ సుపరిచితులు. మంచి వాగ్ధాటి, సమస్యలపై అవగాహన ఉన్న నాయకునిగా గుర్తింపు ఉంది.

కిల్లికి పెద్ద బాధ్యతలు..

పార్టీలో సీనియర్ నేతగా, రెండు పర్యాయాలు ఎంపీపీగా, సుదీర్ఘకాలం సర్పంచ్‌గా పనిచేసి ఆమదాలవలస నియోజకవర్గ నేతగా గుర్తింపు, అనుభవం ఉన్న కిల్లి సత్యనారాయణను విజయనగరం పార్లమెంటు పరిశీలకునిగా నియమించడం ఆయనకు దక్కిన గౌరవంగా కార్యకర్తలు భావిస్తున్నారు. ఇప్పటికే పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న కిల్లి సత్యనారాయణకు ఇప్పుడు పార్లమెంటు పరిశీలకుడు అనే పెద్ద బాధ్యతను వైఎస్ జగన్ అప్పగించారు. అధినేత నమ్మకాన్ని నిలబెట్టి, ఇచ్చిన బాధ్యతను వందశాతం నిర్వర్తించి పార్టీ విజయానికి అహర్నిశలు పనిచేస్తానని చెబుతూనే, తనను గుర్తించిన అధినేతకు కిల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

బాలికపై అఘాయిత్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో తొమ్మిదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం వేరే నగరంలో నివసిస్తున్న బాలిక సెలవుల్లో శ్రీకాకుళంలో తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. బాలికకు తండ్రి లేరు. ఈ నెల 28న ఆ బాలిక ఎదురింటిలో ఉన్న 26 ఏళ్ల యువకుడు ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత తన మేనత్త వద్ద బాలిక ఈ విషయాన్ని చెప్పగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా తొమ్మిదిరోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ హరికృష్ణ వెల్లడించారు.

అపురూప ఘట్టం



మాకివలసలో 37 ఏళ్ల తర్వాత అమ్మవారి పండగలు జరుగుతున్నాయి. పండగలో ప్రధా న ఘట్టమైన మానుకు బొట్టు పెట్టే కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు పసుపు నీళ్ల ముర్రాటలతో ముందుగా అసిరితల్లి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం సమీపంలోని కాంచీపేటకు ఊరేగింపుగా వెళ్లి మానుకు బొట్టు పెట్టారు.

– నరసన్నపేట

జయహో సింహాద్రి అప్పన్న



సంతపేటకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు నర్సింహాచారి పెన్సిల్ ముల్లుపై సింహాచలం అప్పన్న స్వామి నిజరూపాన్ని చిత్రీకరించారు. ఈ రూపాన్ని రూపొందించడానికి మూడు గంటల సమయం పట్టిందని ఆయన తెలిపారు.

– నరసన్నపేట

క్లుప్తంగా

రమణమూర్తికి ఈఓగా పదోన్నతి



అరసవల్లి: అరసవల్లి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుప్పన్నగారి రమణమూర్తికి గ్రేడ్–3 ఈవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి గతేడాది అరసవల్లి ఆలయానికి బదిలీపై రాగా.. తాజా పదోన్నతితో మళ్లీ విజయనగరంలో 6–సి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా మరో రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం అరసవల్లి ఆలయంలో అన్నదాన ప్రసాదాల సెక్షన్ ఇన్‌చార్జిగా ఉన్న ఈయనకు పదోన్నతి రావడంపై ఆలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

'ఆదిత్య'లో జాతీయ స్థాయి పోటీలు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఆలిండియా స్టూడెంట్స్ యూనియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్విజ్, డిజిటల్ పోస్టర్ మేకింగ్, వ్యాసరచన, స్లోగన్ రైటింగ్, అవేర్‌నెస్ రీల్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సాయం



పైడిరాజు కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డు పి.పైడిరాజు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి రూ.4.07 లక్షల నగదు చెక్కును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అందజేశారు. సహచర హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని ఈవిధంగా అందించారు.

నీలమణి దుర్గ ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి 50వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమపూజ, అష్టోత్తర శతనామ పూజ, హోమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, సుదీష్ఠ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మే 7 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఈవో టి.వాసుదేవరావు చెప్పారు. పూజా కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సన్యాసిరావు, బాబ్జీ, సతీష్, మడ్డు రామారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్‌కు స్వాగతం



హరిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

కంచిలి: మండలంలోని దాలేశ్వరం గ్రామంలోని సోలార్ ప్లాంట్ వద్దకు మంగళవారం విచ్చేసిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు మండల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ను కలిసి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీఓ వి.తిరుమలరావు, ఈఓపీఆర్‌డీ పి.ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వేటకు వెళ్లేవారిపైనా.. నిషేధమేనా?

- వేట నిషేధ భృతి మంజూరులో వెలుగుచూస్తున్న 'కూటమి' నేతల లీలలు
- పథకం వర్తించక ఆవేదనలో సుమారు 1200 మంది మత్స్యకారులు
- సుమారు ఐదు వేల మందితో 'సగం వాటా' ఒప్పందం!
- గత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా పథకం వర్తింపు



ఈ చిత్రంలో ఉన్న మత్స్యకారుడి పేరు వారాధి ఎర్రయ్య. రణస్థలం మండలం ఎర్రముక్కాం గ్రామం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదు సార్లు వేట నిషేధ భృతి అందుకున్నాడు. ఈ ఏడాది కూడా వేటనిషేధ భృతి తొలి జాబితాలో పేరుంది. చివర్లో రాజకీయ కారణాలతో పేరు తప్పించేశారు. అర్హత ఉన్నా తన పేరును తప్పించేసి కూటమి నాయకులు తమకు నచ్చినవాళ్లకు ఇప్పించుకున్నారని వాపోతున్నాడు.

అరసవల్లి:

గడిచిన ఐదేళ్లలో కనిపించని, వినిపించని మత్స్యకార జీవన కష్టాలు, అవస్థలు కూటమి ప్రభుత్వంలో మళ్లీ మొదలయ్యాయి. సముద్రంలో వేట నిషేధ కాలంలోనే ఉపాధి కోల్పోయిన వేట మత్స్యకారులకు రాష్ట్ర సర్కార్ పొట్టకొట్టింది. ఇప్పటికే గతేడాది వేట నిషేధ కాలంలో రావాల్సిన భృతిని ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వివిధ రకాల ఆంక్షల కారణంగా అర్హులైన వేట మత్స్యకారులకు భృతి రాకుండా అడ్డుపడింది. ఇదే సమయంలో అనేక మంది అనర్హులకు పథకం వర్తింపజేసి వారికి మంజూరైన సొమ్మును కూటమి నాయకులు సగం.. సగం పంచుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 మండలాల్లో 15548 మంది మాత్రమే మత్స్యకార చేయూత పథకానికి అర్హులంటూ అధికారికంగా ప్రకటించి ఇటీవల ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో ఇటీవల జమ చేసింది. ఇదిలావుంటే అన్ని అర్హతలుండి.. కేవలం కూటమి సర్కార్ ఆంక్షలు, రాజకీయ కుట్రల ఫలితంగా పథక లబ్ధికి దూరమైన సుమారు 12 వందల మంది వరకు మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, వాస్తవ సర్వేను క్షేత్ర స్థాయిలో మళ్లీ చేపట్టాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

అనర్హులంటూ జాబితాలో తప్పించేసి..!

అనర్హుల విషయంలోనే లెక్కల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. మత్స్యశాఖ లెక్కలు ప్రకారం మొత్తం 511 మంది మాత్రమే ఈ పథకానికి అనర్హులుగా తేల్చారు. వీరంతా నిబంధనల ప్రకారం పథక లబ్ధికి అర్హులు కారని స్పష్టం చేశారు. వాస్తవానికి కూటమి అధికారిక జెండాలు పట్టుకున్న కార్యకర్తల చేతిలోనే చాలావరకు జాబితాలు గల్లంతయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలావరకు ఇవే కారణాలతో తుది జాబితాలో పేర్లను మార్చేశారని సమాచారం. దీంతో అనధికారికంగా ఈ అనర్హుల జాబితా 1200 మందికి పైగా ఉందనే లెక్కలున్నాయంటూ మత్స్యకార సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. అయినప్పటికీ కూటమి సర్కార్ మాత్రం సంఘ ప్రతినిధులు, వాస్తవ లెక్కలను బేఖాతరు చేస్తూ..తాము ప్రకటించిన వారికే పథకాల లబ్ధి అంటూ వ్యూహాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇదిలావుంటే ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారికి ఇతర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి జరగదని, ఇతర పథకాలకు అనర్హులంటూ కూటమి సర్కార్ మెలిక పెట్టడంపై ఇప్పటికే మత్స్యకారులు మండిపడుతున్నారు.



సీఎం వద్దకు వెళ్లకుండా ఆంక్షలు..

బుడగట్లపాలెంలో మత్స్యకారులకు భృతి అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వచ్చిన సందర్భంగా గత ఏడాది వేట నిషేధ భృతి అందని వారు, అలాగే తాజాగా భృతి అందాల్సిన జాబితాలో పేరులేని అర్హులు, బాధితులెవ్వరూ సీఎం సభకు వెళ్లకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పక్కాగా వ్యవహారం నడిపించారు. సీఎం వద్దకు ఎవ్వరి నినాదాల స్వరాలు వెళ్లకుండా, వినిపించకుండా అడ్డుకున్నారు. ఇతర సంక్షేమ పథకాలకు దూరమవుతారంటూ హెచ్చరికలు జారీ చేశారని తెలుస్తోంది.

వాటాల పంపకాల్లో పొరపచ్చాలు!

జిల్లాలో 11 మండలాల్లో ఇప్పటికి 15548 మంది అర్హులకు మాత్రమే మత్స్యకార చేయూత కార్యక్రమాన్ని అందించారు. ఒక్కొక్కరికి రూ.20 వేలు కాగా, అందులో నీకు రూ.10 వేలు..నాకు 10 వేలు అంటూ...వారికి అందుబాటులో ఉన్న వారి పేర్లను (మత్స్యకార కుటుంబాలకు చెందిన వారు) జాబితాలో చేర్చుకుని.. ముందస్తు ఒప్పందం ద్వారా బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ కాగానే సగం సగం సర్దుకున్నారని విశ్వసనీయ సమాచారం. ఇలా సుమారు ఐదు వేల మంది వరకు ఉన్నారని సమాచారం. ఈ వాటాల పంపకాల్లో కూటమి నేతల్లో సైతం పొరపొచ్చాలు వచ్చేశాయని తెలుస్తోంది.

లేనిపోని కారణాలతో..



వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయాం. అయితే అర్హుల జాబితాలో నా పేరు ఉంది. తర్వాత లేదని చెప్పారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు కంటే ఎక్కువ వచ్చిందని, లేనిపోని కారణాలు చూపించి నాకు భృతి రాకుండా చేశారు. గతంలో ఐదు సార్లు ఎలాంటి అడ్డంకి లేకుండా భృతి పొందాను. ఇప్పుడు మాత్రం ఆంక్షలు పెట్టి మరీ డబ్బులు ఇవ్వకుండా జాబితాను తగ్గించేశారు.

– గనగళ్ల సూర్యం, పెద్దగనగళ్లవానిపేట, శ్రీకాకుళం రూరల్ మండలం

అర్హులకు అందనివ్వలేదు..



అధికారికంగా 511 మంది మాత్రమే అనర్హులని చెబుతున్నారు. వాస్తవానికి వందలాది మంది గ్రామాల్లో అర్హులున్నారు. సముద్రంలో వేటకు వెళ్లే నిజమైన వారికి సైతం తప్పించి రాజకీయాలతో జాబితాలు మార్చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే రెండు సార్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశా. మరోసారి సర్వే చేసి అర్హులందరికీ వేట నిషేధ భృతి అందజేయాలి.

– కోనాడ నరిసింగరావు, డీఎఫ్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 11 మండలాల్లో మత్స్యకార కుటుంబాలు సముద్రపు వేటతో జీవనాధారంగా సాగిస్తున్నారు. ఇందులో వేటనిషేధ కాలంలో అందాల్సిన భృతికి అనర్హులుగా మత్స్యశాఖాధికారులు మొత్తం 511 మంది అని స్పష్టం చేశారు. శ్రీకాకుళం రూరల్‌లో 31, గారలో 106, ఎచ్చెర్లలో 60, రణస్థలంలో 106, కవిటిలో 61, వజ్రపుకొత్తూరులో 35, పోలాకిలో 41, సోంపేటలో 32, సంతబొమ్మాళిలో 27, ఇచ్ఛాపురంలో 08, మందసలో నలుగురు చొప్పున మత్స్యకారులు అనర్హులుగా గుర్తించారు. వాస్తవానికి ఒక్క శ్రీకాకుళం రూరల్ మండలంలోనే వంద మందికి పైగా అర్హులకు కరెంట్ బిల్లు పెరుగుదల, ఇతర కారణాలు చెప్పి పథకాన్ని వర్తింపజేయలేదు. గార, సంతబొమ్మాళిలలో కూడా ఈ సంఖ్య రెట్టింపుగా ఉంది. దీని ప్రకారం జిల్లా వ్యాప్తంగా మరో 1200 మంది వరకు అర్హులకు ఈ పథకాన్ని వర్తింపజేయాల్సి ఉందనే మత్స్యకార సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే మద్యం వ్యాపారం

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం:

మండల కేంద్రం పాతపట్నంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. మద్యం షాపు వద్ద స్థానికులు, పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రోత్సాహంతోనే ఇళ్ల మధ్య మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కాలనీకి చెందిన మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు వెంటనే మద్యం దుకాణం ఎత్తివేయించాలన్నారు. లేకపోతే ఎమ్మెల్యేపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామన్నారు. మద్యం దుకాణాలు దేవాలయాలు, పాఠశాలలు, హైవేకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ వింగ్ విభాగం ప్రతినిధి ఎనుగుతల సూర్యం, జిల్లా సెక్రటరీ అమర రమణ, నాయకులు గోకవలస రాము, వంశీ, ఫల్గుణరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు తులాల బంగారం చోరీ



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఎల్.ఎన్.పేట: మండలంలోని చింతలబడవంజ కాలనీలో రొంపివలస రమణ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. సోమవారం వర్షం పడిన తరువాత విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో బయట వరండాలో నిద్రపోయామని, మంగళవారం ఉదయం నిద్రలేచిన తరువాత ఇంట్లోకి వెళ్లేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని బాధితుడు రమణ తెలిపారు. బీరువాలో మూడు తులాల బంగారు నగలు, పది తులాల వెండి, రూ.9వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లిపోయారని బాధితుడు మంగళవారం సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎస్సై బాలరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఇచ్ఛాపురం: తాగుడు మానేయాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కంచ్రవీధికి చెందిన పూర్ణచంద బెహర(37) రాడ్‌బెండింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై భార్య రేవతితో గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి రాగా, మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు మందలించారు. వెంటనే భోజనం చేయకుండా గదిలోకి వెళ్లిపోయాడు. లోపలికి వెళ్లి చూసేసరికి నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న పూర్ణచంద్రను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై ముకుందరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

3, 4వ తేదీల్లో బీచ్ ఫెస్టివల్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : బారువ బీచ్ ఫెస్టివల్‌ను మే 3, 4 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ వాటర్ స్పోర్ట్స్, సంప్రదాయ బీచ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బీచ్ ఫెస్టివల్ ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలోని దన్నానపేట సమీపంలో సోమవారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరావుపేటకు చెందిన అమరావు బ్రహ్మాజీరావు రణస్థలం నుంచి స్వగ్రామం బైక్‌పై వెళ్తుండగా, అతనే పక్కనే మరో ద్విచక్ర వాహనం ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన మరో ఒక ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొట్టుకున్నాయి. మూడు బైకులు కింద పడటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రణస్థలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బ్రహ్మాజీరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఏఎస్ఐ సీహెచ్ లక్ష్మణరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ప్రమాదానికి బండి పాలెం వద్ద సగం వేసి వదిలేసిన రోడ్డే కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

పెళ్లింట విషాదం



అప్పారావు(ఫైల్)

సరుబుజ్జిలి: మండలంలోని మూల సవలాపురం గ్రామానికి చెందిన గుడాల అప్పారావు(57) సోమవారం రాత్రి కొత్తకోట జంక్షన్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఇతని కుమారుడి వివాహం మే 13న నిశ్చయించారు. భార్య కుమారితో కలిసి పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లి ఏబీ రోడ్డులో స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జనార్దనరావు తెలిపారు.

వీఆర్‌కు గార ఎస్ఐ

గార : గార పోలీస్ స్టేషన్ ఎస్ఐ రెళ్ల జనార్దనరావును శాఖాపరమైన చర్యల్లో భాగంగా శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గార ఇన్‌చార్జి ఎస్ఐగా శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణకు బాధ్యతలు అప్పగిస్తారని విశ్వసనీయ సమాచారం.

వైఎస్ జగన్‌ను కలిసిన కృష్ణదాస్



వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. జగన్‌ను కలిసిన వారిలో పార్టీ మహిళా సీనియర్ నాయకురాలు బొడ్డేపల్లి పద్మజ కూడా ఉన్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పకడ్బందీగా నీట్ పరీక్షలు



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నీట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అన్ని శాఖల సమన్వయంతో చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మే 4న జరగనున్న నీట్ పరీక్షలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి మారెళ్ల వెంకటేశ్వరరావు నీట్ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఆర్‌జేయూకేటీ–ఎచ్చెర్ల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ–గుజరాతీపేట, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల–శ్రీకాకుళం, కేంద్రీయ విద్యాలయం–శ్రీకాకుళం ఉన్నాయి. మే 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ కిరణ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, నీట్ సిటీ కోఆర్డినేటర్ సుహాయిబ్ ఆలం, చీఫ్ సూపరింటెండెంట్ పీవీ రమణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐ నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. మంగళవారం ఎచ్చెర్ల ఐటీఐలో వివరాలు వెల్లడించారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు ఐటీఐ. ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో మే 24లోపు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐలు ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాస ప్రభుత్వ ఐటీఐల్లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని చెప్పారు.

నేడు 39 పరీక్ష కేంద్రాల్లో పాలిసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ఏపీ పాలిసెట్–2025 బుధవారం 39 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. జిల్లాలో టెక్కలి, శ్రీకాకుళం డివిజన్‌లలో పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచి 11,452 మంది దరఖాస్తు చేసుకున్నారు. సాంకేతిక విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షల్లో నిమిషం నిబంధన అమలు చేస్తున్నారు. జిల్లా అబ్జర్వర్‌గా డాక్టర్ కె.విజయలక్ష్మిని నియమించారు. టెక్కలి డివిజన్ అబ్జర్వర్‌గా గోవిందరావు, శ్రీకాకుళం డివిజన్ అబ్జర్వర్‌గా కె.రత్నకుమార్‌లను నియమించారు. పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అడ్మిషన్ల ఇన్‌చార్జి, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య చెప్పారు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌ల విలీనం



లావేటి అనంతరావు రీజనల్ మేనేజర్

శ్రీకాకుళం అర్బన్: భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామీణ ప్రాంతీయ బ్యాంక్‌ల విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు బ్యాంక్ రీజనల్ మేనేజర్ లావేటి అనంతరావు మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ), చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్(సీజీజీబీ), సప్తగిరి గ్రామీణ బ్యాంక్(ఎస్‌జీబీ) తదితర బ్యాంక్‌లన్నీ విలీనమై మే 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడతాయని చెప్పారు. ఖాతాదారుల నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచి చిరునామాలలో ప్రస్తుతానికి ఎటువంటి మార్పులు చేయడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న అన్ని సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో ఉన్న సీనియారిటీ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా మే 2వ తేదీ సాయంత్రం 5గంటలలోగా తెలియజేయవచ్చని డీఈవో ఎస్.తిరుమలచైతన్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువు దాటిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

గురుకులాల సమస్యలపై వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని, భవనాలకు మరమ్మతులు చేయించాలని, పారా మెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, డైట్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని దళిత, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. 2024 డిసెంబర్‌లో అంబేడ్కర్ వర్ధంతి నుంచి 2025 ఏప్రిల్‌లో అంబేడ్కర్ జయంతి వరకు చేపట్టిన గురుకులాల సర్వే వివరాలను సైతం కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పేడాడ కృష్ణారావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామారావు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దండాసి రాంబాబు, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, రెల్లి కుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అర్జి కోటి, మాదిగ రిజర్వేషన్ల పోరాట సాధన సమితి నగర కార్యదర్శి కానుకుర్తి గోవింద్, మాలమహానాడు నాయకులు ముచ్చ శ్యామ్, సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు వన్నెలు లక్ష్మీనారాయణ, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు చీర రమేష్ తదితరులు పాల్గొన్నారు.